# ఉత్తరాయణం

ఉత్తరం రాయటం ఒక కళ. మిగతా కళల్లాగే ఇది కూడా కొంత మందికీ సొంతం అవుతుంది. దీన్ని టపా కళ అనో , తపాలా కళ అనో అనుకుందాం . ఈ తపాలా కళాకారులు రాసిన వుత్తరాలు మహా పసందుగా వుంటాయి చదువుకోడానికి . తిడుతూ రాసినాచివరికంటా ఆసక్తిగా చదువుతాం. వాళ్ళు రాసిన వుత్తరాలకి చదివించే గుణం వుంటుంది. ఈ టపా కళలో ప్రావిణ్యం లేని వాళ్ళు ఉత్తరాలు రాస్తే అందుకున్న వారికి ఆరోగ్యం పాడవుతుంది. పైగా ఆపార్థాలు , భయాలు సందేహాలు తలెత్తుతాయి. ' మన నల్ల ఆవు ఈనింది. పిల్ల పోయింది. జాలమ్మ కోలుకుంటోంది. మందులిప్పిస్తున్నాం ' అంటూ క్లుప్తీకరించి మూడు ముక్కలు గీకి పారేస్తే దాన్ని చదివే వారికి లక్ష సందేహాలు డెలివరీకి సిద్దంగా వున్న జాలమ్మకి పిల్ల పుట్టి పోయిందా ? లేకపోతే మందు లిప్పించడం దేనికీ ? ఇలా తర్జన భర్జనలతో తల వాచి పోతుంది. అంచేత సినిమా కథల్లాగా ఉత్తరాల్లో కూడా విషయాన్ని అనవసరపు మలుపులు తిప్పకుండా సూటిగా చెప్తే ఆరోగ్యగకరం . కొంత మంది ఒక విషయం గురించి రాస్తూ చటుక్కున ఏదో గుర్తుకొచ్చినట్లు వేరే దాంట్లోకి దూకేస్తూ వుంటారు ....! మొన్న నాన్నగారు దేవాలయానికి వెళ్ళి వస్తూ లారీని తప్పించుకోబోయి ఆటో క్రిందపడ్డారు. అన్నట్లు నా ఫీజు డబ్బులు ఎప్పుడు పంపిస్తావ్ ? అమ్మ పేర్న పంపించు ఆసుపత్రి చుట్టూ తిరగాలి గదా ! ఇలా రాస్తే ఆటోకింద పడ్డ నాన్నగారి పరిస్థితేమిటో తెలీక, ఈ ప్రాణం అల్లాడిపోయి చివరకి ట్రంకాలో , టెలిగ్రామో వాడాల్సి వస్తుంది.

కథలు, కవిత్వాలు రాసేవాళ్ళు ప్రపంచానికి తెల్సినవాళ్ళు. కాని కొంత మందిలో కవులు , రచయితలు రహస్యంగా దాక్కుంటారు.

కవరు, కలం తీసుకోగానే దాక్కున్న రచయితో, కవో వొళ్ళు విరుచుకుని పని ప్రారంభిస్తారు. అటువంటి వారు రాసిన వుత్తరాలు చదవాలంటే సహనం కావాలి ! మొన్న సాయంత్రం గోధూళి వేళ – ఆకాశం నల్ల మబ్బులతో నిండిపోయి, కాటుక మొహానికి పులుముకున్న పిల్ల వెధవలాగా వుంది. ఉరుములు, మెరుపులతో సృష్టి వికటాట్టహాసం చేస్తోంది. సన్నగా చినుకు గూడా ప్రారంభమైంది. ఆఫీసులోంచి

బయటికొచ్చి మఫ్లర్ తీసి తలకి  చుట్టుకున్నాను. ( కాళ్ళకి చుట్టు కుంటామా ) నడక ప్రారంభించేను. వీధిలో జనం  ప్రళయం వస్తోందన్న  సంగతి తెల్సుకున్నట్లు పరిగెడుతున్నారు . నేమాత్రం  తాపీగా  నడుస్తున్నాను ‘ ఇలా  మిమ్మల్ని  బాది బాది అసలు సంగతికొచ్చే  సరికి  కవరయిపోవడం  చేత ఒక్క  ముక్క  ’ నీలవేణి  కనిపించింది. వివరాలు  తర్వాత రాస్తాను. చిత్తగించవలెను అంటూ  ముగిస్తారు.  నీలవేణి  అంటే  ఎంత కాలంగా  మీరు కలవాలని  తహతహలాడిపోతున్న  వ్యక్తి కావచ్చు . మొదటిసారి  మీరు మనసు పారేసుకున్న ప్రియురాలు కావచ్చు. కలిసి  ఏమన్నదోనని రకరకాల ఊహాగానాలు చేసి  నవరసాల్ని  చవి చూస్తారు.

కొంతమందికి ఉత్తరాలు  రాయటం మహా చిరాకు. ఉత్తరం  రాకపోతేనే కులాసాగా వున్నట్టే అనుకొమ్మని  సంబంధితులందరికీ  వోరల్లా  చెప్పేసి  వూరుకుంటారు.  ఇంకా కొంత  మంది ఉత్తరాలు  రాయడం  మహా సరదా.  ఉత్తరం  రాగానే  సమాధానం  రాసి డబ్బాలో వేస్తేనేగాని  ఇంటికెళ్ళరు. ఎంగిలి  పడరు.  ఒక ఆడకి , మగవాడికి  మధ్యన నడిచే  వుత్తరాల్ని ఎవరన్నా  జాగ్రత్తగా  ఫాలో  అవగలిగితే  గొప్ప  సృష్టి రహస్యం , కాల మహిమ, మానవ స్వభావం  కళ్ళకు  కట్టినట్లుగా  అర్ధమవుతాయి, ప్రేమించే  రోజుల్లో రాసుకునే  ఉత్తరాలు  వలపు వేడితో వెచ్చ వెచ్చగా  వుంటాయి.  నువ్వు రాత్రికల్లోకొచ్చావని, అల్లరి  పెట్టావని, మర్నాడు  అన్నం సహించలేదని, ప్రేమ  వరదలయి ప్రవహిస్తుంది. పెళ్ళయి ఇంకా  కాపురానికి  వెళ్ళక  ముందు విరహాలు, అలకలు, అనుమానాలు  ప్రత్యక్షమవుతాయి ! ‘ ఇల్లు వెతుకుతున్నారా  ?  చిన్న గదైనా  సరే దొరికితే వచ్చేస్తా. మీకు  ఏ వంటకాలంటే ఇష్టం ? ’  ఇలా మొదటి  కాన్పుకి  వెళ్ళినప్పుడు విరహాలు,  ఆవేశాల  స్థానేసలహాలు, సందేహాలు  సాక్షాత్కరిస్తాయ్. ‘ జీతం రాగానే బ్యాంకులో  వెయ్యండి . పొద్దు పోయేదాకా తిరక్కండి . సిగరెట్టు  తాక్కండి.  పని  పిల్లతో మీటింగులు  పెడుతున్నారా  ? ’  ఇలా  ....ఇంకో  పదేళ్ళ తర్వాత, క్యాంపుకెళ్ళి  రావడం కాస్త ఆలస్యం  అయితే  ‘ మీరెళ్ళి  అక్కడ హాయిగా  కూర్చున్నారు. ఇక్కడ  నా ప్రాణాలు పోయి ఛస్తున్నాను.  పెద్దాడు  పరీక్ష తప్పాడు.  చిన్నది  పెద్ద మనిషైంది. పేరంటం చెయ్యడానికి  డబ్బుల్లేక  పక్కింటి  పిన్నిగారి దగ్గర అప్పు చేశాను.  నా కళ్ళ జోడు విరిగిపోయింది.  టీవీ పాడయిపోయింది.  వార్తల్ని  ముగ్గురు చదువుతున్నారు. అలా కనిపిస్తోంది.  తర్వగా రండి.  ఆలస్యం  అయ్యేటట్టు  వుంటే డబ్బు పంపించండి ’

మనిషికి  మనిషికి మధ్యన  వేసుకునే వారధి ఉత్తరం. ప్రియురాల్ని పలకరించడానికి , స్నేహితుల్ని  కలుసుకోవడానికి, ఆత్మీయుల్ని  గుర్తు చేసుకోవడానికి,

కష్టాల్ని చెప్పుకోవడానికి, కన్నీళ్ళని తుడిచి ధైర్యం చెప్పడానికి ఉపయోగపడే సాధనం – ఉత్తరం. మొహమాటస్తులకి, పిరికి వాళ్లకీ కూడా ఈ సాధనం గొప్ప వరమే .... కాదంటారా ?

------- అయ్యిపోయింది -------